క్లుప్తంగా

ఎమ్మెల్యే బూచేపల్లికి కృతజ్ఞతలు



బూచేపల్లిని సన్మానిస్తున్న రవిచంద్ర

మార్కాపురం: వైఎస్సార్ సీపీ పోలింగ్ బూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పత్తి రవిచంద్ర సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

పశు ఆరోగ్య శిబిరాలు రేపటికి వాయిదా

- మందుల సరఫరా ఆలస్యమే కారణం

పొదిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు మందులు లేక నిలిచిపోయాయి. పొదిలి మండలంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని పశు వైద్యాధికారులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం వైద్య శిబిరాలు ఎక్కడా కనిపించలేదు. ఉచిత ఆరోగ్య శిబిరాలకు అవసరమైన మందులను సమయానికి సరఫరా చేయకపోవడంతో వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తామని పశు వైద్యాధి కారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. మినీ గోకులాలు, పశుగ్రాసం యూనిట్ల మంజూరు విషయంలో ప్రభుత్వ విధానాలు, అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేతగుడిపిలో పశు ఆరోగ్య శిబిరం



కేతగుడిపిలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, అధికారులు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపిలో పశుఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు స్థానిక సర్పంచ్ డి.పెద్దమస్తాన్ సోమవారం ప్రారంభించారు. పశువైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధుల చికిత్స గురించి వివరించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కవిత, శ్వేత, మనోజ్, భార్గవి, గోపాలమిత్ర రామయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ తండాలో పక్కా గృహాలు నిర్మించాలి

- సబ్‌కలెక్టర్‌కు వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మంత్రునాయక్

మార్కాపురం: పుల్లలచెరువు మండలం పీఆర్సీ తండాలో నివసిస్తున్న పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని లంబాడీ, బడుగు, బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.మంత్రునాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు అర్జీ ఇచ్చారు. తండాలో 24 కుటుంబాలు ఉన్నాయని, పక్కా గృహాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు టి.తిరుమలయ్య మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గంలో తండాలు ఎక్కువగా ఉన్నాయని అందరూ నిరుపేదలేనని వారికి పక్కా భవనాలు నిర్మించి ఇవ్వాలని కోరారు.

లవణాల్లేవ్.. మలినాలే!

- పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఆర్వో ప్లాంట్లు
- సురక్షిత నీటి పేరుతో జోరుగా బుబుల్స్ విక్రయం
- దండిగా దండుకుంటున్న అనధికార ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు
- ప్రభుత్వ అజమాయిషీ కొరవడటమే కారణం

మార్కాపురం:

మార్కాపురం ప్రాంతంలో మినరల్ వాటర్ పేరుతో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. అధికారుల తనిఖీలు నామామాత్రంగా ఉండటంతో ప్లాంట్ల యజమానులదే ఇష్టారాజ్యంగా మారింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిని ప్రజలకు అందిస్తూ వారి అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. మంచినీరు సకాలంలో తీసుకోకపోవడం వల్లే 60 శాతం రోగాలు వస్తున్నాయని పలు సర్వేల్లోనూ వెల్లడైంది. ఈ నేపథ్యంలో సురక్షిత నీటి కోసం జనం నగదు వెచ్చించేందుకూ వెనుకాడటం లేదు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో మంచి నీటి కోసం ఆర్వో ప్లాంట్లే దిక్కయ్యాయి. దీనిని సొమ్ము చేసుకునేందుకు మార్కాపురం నియోజకవర్గంలోని పలువురు అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్లు నెలకొల్పి యథేచ్ఛగా నీరు విక్రయిస్తున్నారు. ఐఎస్ఐ గుర్తింపు లేని ప్లాంట్లలో నీరు ఎంత మేరకు సురక్షితమనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజల అవసరం.. వారికి ఆదాయం

నియోజకవర్గంలో సుమారు 115కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అంచనా. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 20 లీటర్ల నీటి తయారీకి రూ.2 ఖర్చు అవుతుండగా ఇళ్లకు 20 రూపాయలకు, వ్యాపార సంస్థలకు ఐస్ వాటర్ పేరుతో రూ.30కు విక్రయిస్తున్నారు. ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ప్రజలు ఆర్వో ప్లాంట్లలో తయారయ్యే నీటిని తాగితే ఆరోగ్యం బాగుంటుందని నమ్ముతుండటంతో కొందరు వ్యక్తులు ఇదే అదనుగా సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలకు 'నీళ్లు'

సాధారణంగా ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి అవసరం. ఐఎస్ఐ మార్కుతో వాటర్ ప్లాంట్ పెట్టాలంటే సుమారు రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో ఐఎస్ఐ మార్కు కోసం వాటర్ ప్లాంట్ మిషన్‌తో కలిపి రూ.5 లక్షల వరకు వెచ్చించాలి. గంటకు 2 వేల లీటర్ల నీటిని శుద్ధి చేయవచ్చు. 60 గీ40 సైజులో షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంకా హీటర్, మెమరీ తదితర వస్తు సామగ్రిని సమకూర్చుకోవాలి. నీటి పరీక్ష చేసేందుకు శిక్షణ పొందిన సూపర్‌వైజర్‌ను నియమించుకోవాలి. కాగా, ఆచరణలో ఇవేమీ పాటించడం లేదు. కేవలం 4 నుంచి 5 లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ అనుమతి లేకుండా నాసిరకం పరికరాలతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. మార్కాపురం పట్టణంలో సుమారు 40 కేంద్రాలు ఉండగా, ఇందులో ఐఎస్ఐ గుర్తింపు ఉన్నవాటిని వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. తర్లుపాడులో 20, కొనకనమిట్లలో 25, పొదిలిలో 30 ఆర్వో వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. వీటిలోనూ అన్ని రకాల అనుమతులున్నవి స్వల్పమే.

తనిఖీలు నామమాత్రం

పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటవుతున్నా, అధికారుల తనిఖీలు నామమాత్రంగా కూడా లేవు. దీంతో ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. సాధారణంగా మార్కాపురం ప్రాంత నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉంటుంది. దీని వలన ఎముకల పట్టుత్వం తగ్గి కీళ్లవాతం, కాళ్ల వంకర, తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలు తాగితే చిన్న వయసులోనే పళ్లపై గార, కాళ్లు, చేతులు వంకర పోవడం లాంటివి జరిగే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులే ప్రజలను మినరల్ వాటర్ ప్లాంట్ల వైపు మళ్లిస్తున్నాయి. వాటిలో నాణ్యతా పరీక్షలు నిర్వహించకుండానే నీటిని విక్రయిస్తుండటంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది.



ఆటోలో నీటి బబుల్స్



ఆర్వో వాటర్ ప్లాంట్

ఒక లీటర్ మినరల్ నీటికి మిల్లీ గ్రాముల చొప్పున ఉండాల్సిన లక్షణాలివీ..

లక్షణం	అనుమతించిన పరిమితి	గరిష్ట పరిమితి
టీడీఎస్	500	2000
పీహెచ్	6.52	-8.5
నీటి కాఠిన్యత	300	600
కాల్షియం	75	200
క్లోరైడ్	250	1000
ఫ్లోరైడ్	0.52	1.5
క్లోరిన్	0.2	1.0
సల్ఫేట్	200	400
నైట్రేట్	45	-
ఐరన్	0.3	-

పట్టణంలో నీళ్ల దోపిడీ

35 వార్డులు ఉన్న మార్కాపురం పట్టణంలో సుమారు లక్ష మంది జనాభా ఉన్నారు. వీరికి దూపాడు సాగర్ నీరు, చెరువులో వేసిన బోర్ల నీరు కలిపి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని ఇతర అవసరాల కోసం వాడుకుంటున్న ప్రజలు తాగేందుకు మాత్రం ఆర్ఓ ప్లాంట్ నీటినే వినియోగిస్తున్నారు. హోటల్స్‌లో ఆర్వో నీటిని లీటర్ రూ.5 పెట్టి కొనుగోలు చేయాల్సిందే. టిఫిన్, భోజనం తిన్న తర్వాత లీటర్ నీటికి అదనంగా డబ్బు చెల్లించాల్సిందే. మున్సిపల్, రెవెన్యూ, ప్రజారోగ్యశాఖాధికారుల అజమాయిషీ లేకపోవటంతో వాటర్ ప్లాంట్ల యజమానుల ఆదాయం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా మారింది.

ఆర్ఓ ప్లాంట్లను అధికారులు తనిఖీ చేయాలి



ఆర్ఓ ప్లాంట్లను అధికారులు తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. మినరల్ వాటర్‌పేరుతో సరఫరా చేస్తున్న నీటిలో మినరల్స్ ఉండటం లేదనేది బహిరంగ రహస్యం. వీటిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇలాంటి నీటిని తాగి ప్రజలు ఇబ్బంది పడతారు.

– సుదర్శన్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్, మార్కాపురం

ప్రజాప్రతినిధులంటే అంత చులకనా?

- అధికారుల తీరుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల ఆగ్రహం
- గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచన



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ రామనారాయణరెడ్డి

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో చేపట్టే సభలకుగానీ, రెవెన్యూ సదస్సులకుగానీ ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఏ హోదా లేనివారికి రాచమర్యాదలు చేయడం ఎంత వరకు న్యాయమని అధికారులను వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీల సభ్యులను కాదని, గ్రామ స్థాయి టీడీపీ నాయకులను పిలవడం తమను అగౌరవపరిచినట్టేనని సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ పాల్గొని సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు బదులిచ్చారు. పలువురు ప్రభుత్వ అధికారులు తమ శాఖకు సంబంధించి మాట్లాడుతుండగా ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు అక్కిదాసరి ఏడుకొండలు, పలువురు సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశామని వాటి గురించి చెప్పాలని ఎంపీడీఓను కోరారు. గ్రామ స్థాయిలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచ్ తీర్మానం కీలకమని అధికారులు తెలుసుకోవాలని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి హితవు పలికారు. మండల పరిషత్ సమావేశానికి కొందరు రెవెన్యూ అధికారులు ఒక్కసారి కూడా హాజరుకాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో డీఎల్‌డీఓ జోక్యం చేసుకుంటూ.. సమావేశానికి రాని వారి గురించి రాతపూర్వకంగా ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రామాల్లో సాగర్‌నీరు సక్రమంగా సరఫరా చేయాలని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. నాగంపల్లి యూపీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు కోరారు. 1100 ఎకరాలకు సాగు నీరు అందించే వద్దిమడుగు చెరువును అభివృద్ధి చేయాలని సర్పంచ్ పిచ్చయ్య సభ దృష్టికి తెచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు బాగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులను ఆదుకోవాలని సభ్యులు కోరారు. ఎంఈఓ డాంగేషరీఫ్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి సృజన, పీఆర్ఏఈ శ్రీనివాసరెడ్డి, సీడీపీఓ సుదామారుతి, ఉపాధిహామీ పథకం ఈసీ ఈశ్వరి దేవితో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు వారి శాఖలకు సంబంధించి చేపట్టిన, చేపడుతున్న పనులను వివరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఒక పంచాయతీలో ఒకే మోడల్ స్కూల్



మాట్లాడుతున్న ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి

బేస్తవారిపేట: ఒక పంచాయతీలో ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న పాఠశాలలన్నింటినీ కలిపి ప్రైమరీ మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, కాశయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ఎంలకు పాఠశాల పునఃనిర్మాణంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలిపేయనున్నట్లు చెప్పారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8వ తరగతుల విద్యార్థుల సంఖ్య 60 మందికి పైగా ఉంటే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్, 30 లోపు ఉంటే డౌన్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. 30–60 మధ్యలో విద్యార్థుల సంఖ్య ఉంటే పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బేస్తవారిపేట మండలంలో గతంలో ఆరు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా.. ఇకపై నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బేస్తవారిపేట జెడ్పీ బాలుర, బాలికల, పిటికాయగుళ్ల, గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంల పర్యవేక్షణలో పాఠశాలల నిర్వహణ ఉంటుందన్నారు. క్లస్టర్ యూనిట్‌గా అడ్మినిస్ట్రేషన్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో హెచ్ఎంలు పాల్గొన్నారు.

మహిళలు అక్షరాస్యత కలిగి ఉండాలి

- ఎంపీడీఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

మార్కాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మహిళ అక్షరాస్యత కలిగి ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల కోసం నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా మహిళలకు చదువు నేర్పించేందుకు ముందుకు వచ్చిన ఉపాధ్యాయులకు వెలుగు ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కుటుంబంలోని ప్రతి మహిళ చదువుకుని అభివృద్ధి చెందాలన్నారు. మహిళలకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ప్రభుత్వం పుస్తకాలు రూపొందించిందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఎమ్ఈఓ రాందాస్‌నాయక్, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ ఝాన్సీ, సీసీలు నాగయ్య, మనోకుమారి, వీఓఏలు, వలంటీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఈఈ నాగేశ్వరరావు, పక్కన సిబ్బంది

మార్కాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈఈ నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జునరావు, రవికాంత్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జూనియర్ లైన్‌మన్, గ్రేడ్–2 లైన్‌మెన్లకు వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఉద్యోగులకు భద్రతాపరికరాలు అందించాలని కోరారు. తన స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తానని ఈఈ నాగేశ్వరరావు చెప్పారు. విద్యుత్ సంస్థను లాభాల బాటలోకి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉస్మాన్, నాయకులు జాన్సన్, మోహన్‌రావు నాయక్, మునిస్వామి, కొండయ్య, మంత్రునాయక్, దస్తగిరి, రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై జాగ్రత్తలు పాటించాలి



పొదిలిలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

పొదిలి రూరల్: అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలు, నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై రిమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలెప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పొదిలి, చీమకుర్తి, మర్రిపూడి మండలాల అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 40 గ్రామాల్లో వయోజన బాలలు, గర్భిణులు, బాలింతలు, ఇతర స్త్రీలకు అయోడిన్, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభన్‌బాబు, సీడీపీఓ సుధామారుతీ, ఎంఈఓ–2 నాగలక్ష్మి, గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై వ్యాసరచన పోటీలు



కంభంలో వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న అధికారులు



పొదిలి : పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను తహసీల్దార్ పరిశీలించారు. ఓటింగ్ సరళిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మాల్యాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

పొదిలి రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయిలో సోమవారం నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. డిబేట్‌లో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ షారోనురాణి ప్రథమ బహుమతి, మహర్షి స్కూల్‌కు చెందిన సీహెచ్ సాయిదీక్ష ద్వితీయ, సీహెచ్ ప్రసన్న తృతీయ బహుమతులు పొందారు. వ్యాసరచనలో బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.సుమయ ప్రథమ బహుమతి, ఎస్‌కేవీ మాహీన్ ద్వితీయ, మహర్షి నుంచి సీహెచ్ సాయిదీక్షిత తృతీయ బహుమతి సాధించారు. క్విజ్‌లో మహర్షి విద్యార్థులు ఎస్.సాహిత, బి సహస్ర, పి.నిరుపమ్‌తేజ్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీలకు జడ్జిలుగా వీఎం మోహన్‌కృష్ణ, వి మల్లికార్జునరావు, జి రమణారెడ్డి, పద్మరావు వ్యవహరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సీఆర్పీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు, ఓటు ప్రాముఖ్యతపై మార్కాపురం జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తహశీల్దార్ చిరంజీవి సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మార్కాపురం నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లోని విజేతలతో కలిపి మంగళవారం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారిని 23న జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాందాస్‌నాయక్, శార్వాణి, జెడ్పీ హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీల కోసం 8 ఆర్టీసీ బస్సులు



ఆర్టీసీ బస్సులో కూలీలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, ఎంవీఐ మాధవరావు

మార్కాపురం: వ్యవసాయ కూలీలు పనుల కోసం ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో పోలీసులు సోమవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ సుబ్బారావు, డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు తదితరులు సోమవారం 8 ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. కుంట, కంభం సెంటర్, దోర్నాల సెంటరు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ డిపో వద్ద బస్సులు ఏర్పాటు చేసి కూలీలను పని ప్రదేశాలకు పంపినట్లు సీఐ తెలిపారు. ఇకపై కూలీలను బస్సుల్లోనే తరలించాలని ఎంవీఐ మాధవరావు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణాలకు స్వస్తి పలకండి

కంభం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించే వారు ఇకపై అటువంటి ప్రమాదకరమైన ప్రయాణాలకు స్వస్తి పలకాలని ఎస్సై నరసింహారావు సూచించారు. సోమవారం తురిమెళ్ల రోడ్డులో వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్లు, కూలీలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.